సంక్షేమ సేవాలయాలు

- స్థానికంగానే అన్ని సేవలు
- అర్హులకు అందుతున్న సంక్షేమ ఫలాలు
- సచివాలయాల్లో సకల సమాచారం

గురజాల : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేరుతుంది. ప్రజలకు ఏ సమాచారం కావాలన్నా....ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవీ వారికి చేరాలన్నా సచివాలయాలే కీలకంగా మారాయి. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టిన నాటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కాగా పథకాలు అందుతున్నాయి. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా వలంటీర్లు విధులు నిర్వహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థను రూపొందించిది. సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వలంటీర్లు సేకరించి సచివాలయాల్లో పొందుపరచి పథకాలు ప్రజల చెంతకు చేరేలా కీలకపాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రంలో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలంటే కేవలం తెలుగు తమ్ముళ్లకు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులకు మాత్రమే అందేవి. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే జేబులు నింపుకునేందుకు దోహదపడేవి. ఏదైనా ఒక పథకం మంజూరు కావాలంటే అన్ని అర్హతలు ఉన్నప్పటికి....జన్మభూమి కమిటీ నేతల సిఫార్సు చేస్తేనే ముందుకు వెళ్లేది లేకపోతే వారికి అర్హత ఉన్నా పథకం వారి దరిచేరేది కాదు. అర్హులు పథకం మంజూరు కాలేదని కార్యాలయాల చూట్టు రోజులు, నెలలు, ఏళ్ల తరబడి తిరుగుతూనే ఉండేవారు. కానీ వారికి ఫలితం ఉండేది కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు మారిపోయాయి. సంక్షేమ పథకానికి అర్హులు అయితే చాలు..వారి ఇంటికే వలంటీర్‌లు వెళ్లి సంక్షేమ పథకాలు అందించే విధంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకం రాకపోతే సచివాలయానికి వెళ్లి అడిగితే ఎందుకూ రాలేదు అన్న విషయాన్ని క్షణాల్లో చెప్పే విదంగా ఉన్నారు. ఏమి చేస్తే పథకం వస్తుంది అన్న వివరాలను చెబుతారు. అర్హుల జాబితాను కూడా పారదర్శకంగా సచివాలయాల్లో డిస్‌ప్లే పెట్టడం వంటివి సచివాలయ సిబ్బంది చేస్తున్నారు. అదే విదంగా ఏపథకానికి ఎవరు అర్హులు..ఎలా దరఖాస్తు చేసుకోవాలి ..తదితర వివరాలు కూడా సచివాలయాల్లో పొందుపరుస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రజలు ప్రభుత్వ సేవలు తమ చెంతకు చేరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



జంగమహేశ్వరపురంలో గ్రామ సచివాలయం



వలంటీర్లకు సత్కారం చేస్తున్న నాయకులు, అధికారులు

మండలాల వారీగా వివరాలు

మండలం	సచివాలయాలు	సచివాలయ ఉద్యోగులు	వలంటీర్లు
గురజాల	18	140	330
దాచేపల్లి	15	106	320
మాచవరం	15	121	296
పిడుగురాళ్ల పట్టణం	17	147	320
పిడుగురాళ్ల రూరల్	15	128	345

80 సచివాలయాలు...1611 మంది వలంటీర్లు

నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలో 80 సచివాలయాలు ఉన్నాయి.వాటిలో 642 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 1611 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది...



గతంలో పింఛన్ తీసుకోవాలంటే గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రోజుల తరబడి వేచి ఉండి పింఛన్ తీసుకోవాల్సివచ్చేది. కానీ నేటి ప్రభుత్వంలో 1వ తేదీ తెల్లవారకముందే వలంటీర్ ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారు. పింఛన్ దారులు వృద్ధులు, వికలాంగులకు ఎంతో ఉపయోగకరంగా వుంది. గతంలో రోజుల తరబడి వేచిచూడాల్సివచ్చేది. వలంటీర్ వ్యవస్థ మాలాంటి వారికి ఇబ్బందులు లేకుండా ఉన్నాయి.

వెన్నా అంజిరెడ్డి, కామేపల్లి, లబ్ధిదారుడు

అర్హత ఉంటే చాలు..



ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలంటే అర్హత ఉంటే చాలు వారి గడప వద్దకు వస్తాయి. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హత ఉంటే వారి వద్ద సంబందిత పత్రాలను తీసుకుని సచివాలయంలో అందిస్తారు. వెంటనే వారికి ఉన్న అర్హతను బట్టి వారికి సంక్షేమ పథకం అందుతుంది. సంక్షేమ పథకాల కోసం మండల కేంద్రానికి రావల్సిన పనిలేదు. కార్యాలయాల చూట్టు తిరిగే పనిలేకుండా వారికి అందుతున్నాయి.

– ఫణికుమార్ నాయక్, ఎంపీడీఓ, గురజాల

ఈ సంక్షేమాన్ని ఆగకుండా కొనసాగిద్దాం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకుండా కొనసాగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కారెంపూడిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించారు. ముందుగా ముస్లిం పెద్దలతో కలసి జెండా చెట్టుకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెండా చెట్టు బజారులో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు చేకూర్చిన లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించారు. సగటున ఒక్కో కుటుంబానికి రూ.2.5 లక్షల నుంచి 5 లక్షల దాకా చేకూరిన లబ్ధిని తెలిపే సంక్షేమ కరదీపికలను అందించారు. లబ్ధిదారులను పేరు పేరున ఆప్యాయంగా పలకరించి ఏఏ పథకం కింద ఎంత లబ్ధి చేకూర్చింది చదవి విన్పించారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అని అవ్వాతాతలను ఇతరులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు ఇంటి దగ్గరకే వచ్చి అందిస్తున్నారని ఆ పింఛన్ డబ్బులతో ఒకరిపై ఆధారపడకుండా జీవిస్తున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, చేదోడు ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా, వసతి దీవెనలు, రైతు భరోసా , సున్నా వడ్డీ, ఆరోగ్యశ్రీ, బీమా, చేయూత పథకాలు ఎలా ఉన్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బాగానే ఉన్నాయని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకాలు అందడం వల్ల ఆర్థిక ఇబ్బందులను అధిగమించామని చాలా మంది ప్రభుత్వ విప్ పీఆర్కేతో సంతోషాన్ని పంచుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా ఉంటే ఈ పథకాలన్నీ కొనసాగించడంతో పాటు ఇంకా మెరుగైన సేవలు ప్రజలకు సీఎం అందిస్తారని పీఆర్కే పేర్కొన్నారు. కారెంపూడిలో 1,568 మైనార్టీ కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. త్వరలోనే వైఎస్సార్, జగనన్న లేఅవుట్స్‌లో పట్టాలు పొందిన 863 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కూడా చేయిస్తామని ప్రభుత్వ విప్ ప్రజలకు వివరించారు. కారెంపూడిలో దాదాపుగా 5,773 కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా దళారుల ప్రమేయం లేకుండా అవినీతి అక్రమాలకు తావు లేకుండా రూ.14.72 కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ఇతర పథకాల ద్వారా పరోక్షంగా మరో 2,170 కుటుంబాలకు సుమారు రూ. 9 కోట్ల దాకా లబ్ధి చేకూర్చిన విషయాన్ని గుర్తు చేశారు. అంటే దాదాపుగా గ్రామంలో అర్హులైన ప్రతి గడపను ప్రభుత్వం ఆదుకుందని ఈ విధంగా గతంలో ఎవరైనా ఆదుకున్నారా అని ప్రశ్నించారు. లేదని ప్రజలు సమాధానాలు ఇవ్వడంతో మీరంతా జగనన్నకు మద్దతుగా నిలిస్తే జగనన్న మరింత మెరుగైన చేయూతను అందిస్తారని పీఆర్కే ప్రజలకు భరోసా కల్పించారు. గ్రామంలో ఉన్న సుమారు 9 వేల గడపలకు గాను 21 వివిధ పథకాల ద్వారా 7,943 కుటుంబాలకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. ఇది వాస్తవమని ప్రభుత్వాలు ఈ విధంగా ప్రజలను ఆదుకోవడం ఎప్పుడైనా జరిగిందా అని ప్రశ్నించారు. అందుకే ఎన్నికలప్పుడు అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత వాగ్దానాలతో దగా చేస్తారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గతంలో టీడీపీ ఇలాగే 600 వాగ్దానాలు చేసి చివరకు ఏమీ చేయకుండా మోసం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ప్రభుత్వ విప్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన ప్రతి మాటను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి తీరుతారని ప్రజలకు వివరించారు. పేదల కోసం టీడీపీ ప్రభుత్వం సుదీర్ఘ కాలంలో కూడా జగనన్న చేసిన దాన్లో వీసమెత్తు కూడా చేయలేదన్నారు. దేశంలోనే ఎవరూ సాహసించి అమలు చేయలేని సంక్షేమాన్ని మన రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి అందించారని పీఆర్కే చెప్పారు. మంచి మనస్సున్న ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచి మన భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడప గడపలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు సాదర స్వాగతం లభించింది. ప్రతి గడపలో ప్రజలు పీఆర్కే పట్ల ఆదరాభిమానాలు చూపారు. బాణా సంచా కాల్చి స్వాగతం పలకడంతో పాటు ఇళ్లకు వెళ్లినప్పుడు పూలమాలలు వేసి శాలువాలు కప్పి పీఆర్కేను సన్మానిస్తున్నారు. మధ్యమధ్యలో అల్పాహారాలు అందించారు. దాంతో పాటు రాత్రికి మూడు వేల మందికి భోజనాలు కూడా పెట్టి ఆదరించారు. ఇలా ఉత్సాహంగా కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామ సర్పంచి రమావతు ప్రమీలా భాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, ఎంపీటీసీలు షేక్ ఆరీఫ్, అంతరగడ్డ ఏసోబు, వేముల లింగయ్య, పార్టీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, చీతిరాల కోటేశ్వరరావు, గుండా శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, మాజీ సర్పంచ్‌లు నర్సింగ నాగేశ్వరరావు, గాడిపర్తి పూర్ణయ్య, రామదేని ఆంజనేయులు, ఉన్నం శ్రీనివాసరావు,ఆకుల నాగేశ్వరావు, మాదాసు శ్రీను, కొత్తా కాశిరెడ్డి, గురజాల రామారావు, పులిమి దర్గా, ట్రస్టు బోర్డ్ చైర్మన్ చల్లా ప్రసాద్, కొమ్ము చంద్రశేఖర్, ఆశం విజయభాస్కరరెడ్డి, సయ్యద్ సాజన్, షేక్ సైకిలాబ్, బజాజ్ మీరా, అయ్యప్ప , కొత్రపాటి సుధ, జక్కా నరసింహారావు, పలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



మాచర్ల: అనారోగ్యంతో ఇబ్బంది పడే ప్రతి కుటుంబాన్ని ఆదుకునే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు చేయూతనందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న నిమ్మల శ్యామలా దేవికి సీఎం రిలీఫ్ కింద మంజూరైన రూ. 55వేల చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి, గ్రామ స్థాయిలో ప్రతి ఊరికి వైద్యం అందజేసే విధంగా బలోపేతం చేశారన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పేద ప్రజలు అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆయా పట్టణ నాయకులు, మండల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం

గురజాల (దాచేపల్లి): దాచేపల్లి పట్టణానికి చెందిన చల్లా కనకరావు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. చల్లా కనకరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కనకరావు మృతదేహానికి మట్టిఖర్చుల నిమిత్తందాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య చేతులమీదుగా అందించారు. చైర్మన్‌తో పాటు యర్రంశెట్టి సైదారావు, కో ఆప్షన్ మెంబర్ గుంజా వెంకటప్పయ్య, వడ్డెర కమ్యూనిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బోరింగ్ ఏర్పాటు



పిడుగురాళ్లరూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి 66 సంవత్సరాలు పూర్తి చేసుకుని 67వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా మండలంలోని పందిటివారిపాలెం గ్రామంలోని బీసీ కాలనీలో మంచి నీటి వసతి తీర్చేందుకు ఆదివారం బోరింగ్‌ను ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య సొంత నిధులతో బీసీ కాలనీ ప్రజలకు దాహార్తి తీర్చేందుకు బోరింగ్ వేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గురజాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురజాల ఎస్ఐ బి అనంతకృష్ణ ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. స్థానిక బ్రహ్మనాయుడు విగ్రహం సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ 3 9టీవై8070 నంబరు గల మినీ లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి వాహనాన్ని ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనం గోగులపాడు నుంచి అంబాపురం మీదగా గురజాల వచ్చిందని, లారీలో 94 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయని, వాటి బరువు 4,740 కిలోలున్నాయని ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని బియ్యంతో సహా సీజ్ చేసి ఎస్ఐ అనంతకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

నరసరావుపేట ఈస్ట్: శ్రీరాంపురంలోని బ్రహ్మంగారి గుడి వద్ద హిందూ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దశ సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన పారాయణంలో 1008 మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, వాసవి అన్నదాన సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు వీఎస్‌పీ సాంబశివరావు, హిందూ పరివార్ కమిటీ ప్రతినిధులు కొత్తూరి వెంకటనరసింహారావు, గోపవరపు శ్రీనివాసరావు, వెంకటయల్లారావు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


శిరిగిరిపాడులో ఏరువాక సాగుతున్న రైతులు


కొత్తపల్లిలో ఏరువాక సందర్భంగా ఊరేగింపు నిర్వహిస్తున్న, వైఎస్సార్ సీపీ నాయకులు

గురజాల : వర్షఋతువులో వచ్చు జ్యైష్ఠ శుద్ధ పౌర్ణమిని రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటారు. మండలంలోని రైతులు ఆదివారం సాయంత్రం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ పనులను ప్రారంభించారు. ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి ఎద్దులను పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి నాగలిని పూజించి పొలంకు వెళ్లి దుక్కిదున్ని పనులు ప్రారంభించారు. రైతులు ఈ ఏడాది కూడా మంచి దిగుబడి సాధించాలని ఆకాంక్షిస్తూ పనులు ప్రారంభించారు.

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు తమ పంట పొలాల్లో చెట్లు కొట్టి అరకలు దున్ని పొలాలను చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సక్రమంగా పండాలని, రైతులు గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిరిగిరిపాడు, గుండ్లపాడు, వెల్దుర్తి, కండ్లకుంట గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఏరువాక సాగారు. ఉండ్రాళ్ళతో వినాయకునికి పూజలు నిర్వహించి ఊరేగింపుగా బయలుదేరి వెళ్ళారు.

కొత్తపల్లిలో ఏరువాక పండుగ

మాచర్ల రూరల్: రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే ఏరువాక మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రైతులు వినాయకుని స్వామి ఉండ్రాళ్ళను తయారు చేసి గ్రామంలో వాటిని వీధుల్లో ఊరేగింపు నిర్వహించి వినాయకునికి నైవేద్యం పెట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి సకాలంలో వర్షాలు కురుస్తూ రైతన్నలకు అండగా నిలుస్తున్న స్వామి వారు ఈ ఏడాది తమ పై దయ చూపి సిరులు కురిపించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంట పొలాల్లో అరకలు దున్ని పొలాలను చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పూజారి గిరిశర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, మండల ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హనిమిరెడ్డి, పున్నారెడ్డి, బాలిరెడ్డి, జయభారత్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. శివాలయాల్లోను, విఘ్నేశ్వరస్వామి ఆలయాలలోను రైతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి పొలాల్లో ఏరువాక సాగారు. ఈ సందర్భంగా స్థానిక మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రైతులకు సంబంధించిన అతిపెద్ద పండగ అన్నారు. తొలకరి ఆసన్నమవగా దున్నడానికి సిద్ధంగా ఉన్న పంటపొలాన్ని శుద్ధి చేసుకుని సేద్యం మొదలుపెట్టే ఉత్సవాన్ని ఏరువాక పున్నమి అంటారన్నారు. భూమిని, పశువులను, సేద్యానికి అవసరమైన పనిముట్లను అన్నదాత (రైతులు) ఈ రోజు పూజించి ఆహారం పండించేందుకు సహకరించాలని కోరుతారన్నారు. ఏరువాక పున్నమి పాటలు పాడుకుంటూ ఏరువాక సాగి ఈ ఏడాదైనా సకాలంలో మంచి వర్షాలు కురిసి సంవృద్ధిగా పైరుపంటలు పండి కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని రైతులు ఇష్టదైవాన్ని కోరుకుంటారన్నారు.

రెంటచింతలలో వాహనదారులకు కౌన్సెలింగ్

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనదారులకు, స్థానిక మాచర్ల– గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపుల ట్రాఫిక్‌కు అంతరాయంగా వాహనాలు నిలిపినవారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ షేక్ షమీర్ భాష తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓవర్ లోడ్, హెల్మెట్‌లే కుండా వాహనాలను నడిపిన, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న, మైనర్లు వాహనాలను నడిపిన 10 మంది నుంచి రూ.2 వేల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిన వారి నుంచి రూ.1000 నుంచి రూ.2వేల వరకు అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు, 10 రోజుల నుంచి ఒక నెల వరకు జైలు శిక్ష విధించడం జరుగుతుందని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న చిలకా మరియదాసు విధి నిర్వాహణలో ఉండి అనారోగ్యం కారణాల రిత్యా హాస్పటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ఆంజనేయులు, రూరల్ ఎస్ఐ రబ్బానీ, పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ స్టేషన్ సిబ్బంది మరియదాసు మృతదేహం వద్దకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు రూ. 20 వేలు, తోటి సిబ్బంది రూ. 85 వేలు సేకరించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

సాగర్‌మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు


భక్తులకు సందేశం ఇస్తున్న గురువులు జోసఫ్ బాలసాగర్


దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ భక్తులకు ప్రసాదించాలని ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత ఆశీస్సులు మీ అందరి యందున ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఉద్బోధించారు. అనంతరం భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆ తరువాత దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షణలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాస నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జేష్ఠ పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం నిత్తం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. 108 కలశాలతో స్వామికి సహస్రనమారాచ్చన తిరుప్పావడ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్త పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డిబంగారయ్య మాట్లాడుతూ ఈఏడాది వర్షాలు బాగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామికి ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం రోగనిర్ధారణ చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, మాజీ సర్పంచి పడాల చక్రారెడ్డి పాల్గొన్నారు.

పాండురంగస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని శ్రీరుక్మాబాయి సమేత శ్రీపాండురంగస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పల్నాడు జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ మిట్టపల్లి రమేష్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా టి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి.సీతారామయ్య, కోశాధికారిగా పి.వి.లక్ష్మీవరప్రసాదరావు, చీఫ్ ఆర్గనైజర్‌గా బి.వెంకటేశ్వరరావుతో పాటు మరో ఏడుమంది కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరావు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పూరా భాస్కరరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నూతన కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పర్యావరణ పరిరక్షణపై కళాజాత

నరసరావుపేట: రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంపై కళాజాత బృందం ఆదివారం అవగాహన కల్పించారు. మార్కెట్‌సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్లలో ప్రదర్శనల ద్వారా ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించారు. సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ పర్యవేక్షణలో గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ అవేర్నెస్ ఆర్గనైజేషన్‌కు చెందిన కళాకారుల బృందం ప్రచార చేశారు. ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్ధాలు, మిషన్‌లైఫ్‌లో జీవన విధానాన్ని మెరుగుపర్చుకునేందుకు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటలు పాడుతూ వివరించారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో అన్నీ సబ్జెక్టులు బోధించేందుకు అనుభవం అర్హతలు కలిగిన లెక్చరర్ల ఏడుగురిని ప్రభుత్వం నియమాకం చేసినట్లు చెప్పారు. బాలికల జూనియర్ కళాశాల ప్రవేశాల కొరకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు అన్నీ గ్రామాల్లో క్యాంపెయన్ కూడా నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేయటంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి కళాశాల గురించి వివరించామన్నారు. ఆయనతో పాటు లెక్చరర్ల కె.శ్రీనివాసరాజు, పి.సురేష్‌కుమార్, కవిత, లిల్లీకిరణ్మయి, విమలాకుమారి పాల్గొన్నారు.